# ట్రాజడీ

**పే**పర్లు దిద్దటానికి కర్నూలు వెళ్ళినప్పుడు 'స్పాట్ వాల్యుయేషన్ సెంటర్'లో రామారావుగారు కనిపిస్తే పల్కరిద్దామని దగ్గరగా వెళ్ళాను. చదువుకొనే రోజుల్లో నాకు ఆయన గురువు. లెక్కలు చెప్పటానికి వచ్చేవాడు. చాలా మొద్దువాడికి కూడా చక్కగా అర్థమయ్యేలా చెప్పే నేర్పరి ఆయన. "రామారావు మేడీజీ" అనుకొనేవాళ్ళం అప్పట్లో మేము. నేను ఉద్యోగంలో ప్రవేశించిన తర్వాత కూడా ఆయన కనిపించినప్పుడల్లా ఎంతో ఇష్టంగా పలకరించేవాణ్ణి. నిరుడు పేపర్లు దిద్దడానికి చిత్తూరు వెళ్ళినపుడు కూడా ఆయన వచ్చారు. ఆయనకింక నాలుగయిదు సంవత్సరాలు సర్వీసు వుండొచ్చు... అయినా చాలా ఉత్సాహంగా, చలాకీగా వుంటారు.

ఆయన మరెవరితోనో మాట్లాడుతున్నారు. ఆయన పక్కన మరో పదహారేళ్ళ కుర్రాడు కూడా ఉన్నాడు. ఆయన చేతిలో వంకీకర్ర వుంది. మనిషి కొంచెం అలిసినట్టు కన్పించారు.

దగ్గరకి వెళ్ళి "నమస్కారం సార్" అన్నాను. మాటలు ఆపి ఆయన నావేపు చూసి "ఓ... నువ్వా మూర్తీ! ఎప్పుడు వచ్చావ్! పేపర్లు దిద్దటానికేనా?" అన్నారు భుజంమీద చేయి వేసి.

నేను అవునన్నట్లు తలూపి ఆయన కాలువేపు చూస్తూ "ఏమిటి సార్! కర్ర పట్టుకున్నారు" అనడిగాను.

"నెలక్రితం బాత్‌రూమ్‌లో జారిపడ్డాను మూర్తీ! తుంటి ఎముక డిసార్డరయింది...."

"అయ్యో! బాత్‌రూమ్‌లో పడ్డారా! బాగా దెబ్బ తగిలిందా?"

"ఆ!... బాగానే దెబ్బ తగిలింది... చాలా బాధపడ్డాను నెల్లాళ్ళు"

"ఎక్కడికీ వెళ్ళి కట్టు కట్టించుకోలేదా?"

"పుత్తూరు వెళ్ళి కట్టు కట్టించుకున్నాను. అయినా సరిగా కుదురుకోలేదు. ఈవైపు పొడుచుకొని కనిపిస్తూంది చూడు..." అంటూ నా చేతిని పట్టుకొని తుంటి ఎముకకు తాకించాడు. ఆ ప్రదేశంలో ఎముక ఉబ్బెత్తుగా చేతికి తగిలింది.

"నొప్పిగా ఉంటుందా సార్" అనడిగాను.

"నొప్పి లేదుగాని నడవటానికే యిబ్బంది. కర్రసాయం లేకపోతే నడవటం కష్టం. వేగంగా నడవడం అసలు సాధ్యం గాదు. మెట్లెక్కాలన్నా, దిగాలన్నా చాలా యిబ్బంది. ఎందుకైనా మంచిదని మా అబ్బాయిని కూడా వెంటతీసుకొచ్చాను' అన్నారు పక్కనున్న కుర్రాణ్ణి చూపిస్తూ.

తర్వాత ఆయన యిటూ అటూ నడుస్తూంటే చూశాను. నడకలో కొంచెం మార్పు కనిపడింది.. కుంటి నడకే! అయ్యో అనిపించింది నా మనసుకి. ఆయన చాలా సిగ్గుపడుతున్నట్టే కనిపించారు.

"ఏమిటో ఈ ముసలి ముప్పున యిదొకటి వచ్చి పడింది" అన్నారు దిగులుగా. "జీవితం సాఫీగా వెళ్ళిపోతుంది అనుకున్నాను. కుంటిబతుకు రాశాడు నా మొహాన్న దేవుడు..."

"అబ్బే అలా బాధపడకండి సార్ మీ నడకలో నాకేం తేడా కనబడ్డం లేదే!"

"ఆఁ ఎందుకు లేవయ్యా హాస్యాలు! కుంటివాణ్ణి కుంటివాడంటే తప్పేముందిలే" అంటూండగా ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "ఏ రోజుకు ఏం జరుగుతుందో చెప్పలేం. నా కాలు ఇలా అవుతుందని కలలో నన్నా అనుకోలేదు."

"ఎక్కడ దిగారు?" అన్నాను ఆయన ధోరణి మార్చాలని.

"రాక్ వుడ్ హైస్కూల్లో" అన్నాడాయన.

ఇలాంటివే మరో పదినిమిషాలు మాటాడుకొని ఎవరి గదులకు వాళ్లు వెళ్ళిపోయాం. పాపం ఆయన కుంటుతూ అడుగులు వేయటానికి సిగ్గుపడ్డట్టే వుంది.

వారం రోజులతర్వాత సెంటర్ క్యాంటీన్‌లో కన్పించారు రామారావుగారు కాఫీ తాగుతూ.

నేనూ ఒక కప్పు కాఫీ పుచ్చుకొని ఆయన పక్కనే చేరాను.

"ఎన్ని పేపర్లు యిచ్చారోయ్...." అనడిగాడు మాటవరుసకు.

"ఇరవై యిచ్చారు. ఓ పది దిద్ది యిలా వచ్చాను" అని "మీ అబ్బాయి కనిపించటంలేదే" అనడిగాను.

"నిన్న హాస్పటల్‌కి వెళ్ళాను ఆర్థోపెడిక్ సర్జన్‌ను కలుద్దామని. ఆయన లేరు. ఈ రోజైనా వున్నారేమో కనుక్కురమ్మని మావాణ్ణి పంపించాను" అన్నారు.

"సర్జన్ దగ్గరికెందుకండీ! మళ్ళీ కాలు చూపించుకుంటారా?" అనడిగాను.

"అబ్బే... అదేంలేదు... అలాంటిదే అంటూ ఏదో ఆయన నసిగారు.

ఇలా అంటున్నాడేమిటి అని నేను కొంచెం ఆశ్చర్యపడ్డాను. కాఫీలు తాగటం పూర్తిచేసి ఎవరి గదులకు వాళ్ళు వెళ్ళాము.

❖ ❖ ❖

ఆరోజు 'పెన్‌డౌన్ స్ట్రయిక్"

పేపర్లు దిద్దడానికి మాకిస్తున్న రెమ్యూనరేషన్ పెంచాల్సిందిగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని 'స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ల'లోని ఉపాధ్యాయులందరూ పేపర్లు దిద్దటాన్ని బాయ్‌కాట్ చేశారు. మా సెంటర్‌లోని ఉపాధ్యాయులందరమూ 'స్ట్రయిక్' లో పాల్గొన్నాం. అందువల్ల ఆరోజు మాకేం పనిలేదు.

ఏమీ తోచక నేనూ, నా సహోపాధ్యాయుడు రామకృష్ణా ఉదయం మ్యాట్నీకి వెళ్ళాం. మ్యాట్నీ చూసుకొని భోంచేయటానికి 'బృందావన్' వెళ్తుండగా దారిలో రిక్షాలో ఎదురుపడ్డాడు రామారావు మాస్టారు. రిక్షాలో ఆయన, ఆయన కుమారుడూ కూచోనున్నారు. నన్ను చూసి రిక్షా ఆపించారు రామారావుగారు.

"ఎక్కడికెళ్ళారు సార్?" నిలబడి మాటవరుసకు అడిగాను ఆయన్ను.

"హాస్పిటల్ నుంచీ వస్తున్నాం మూర్తీ" అన్నారాయన.

"సర్జన్‌ను కలిశారా?"

కలిశానన్నట్లు తలూపారాయన.

"ఏమన్నారు? కాలు తిన్నగా వస్తుందన్నారా?"

''అనటానికేముందిలే... ఇప్పుడు తిన్నగా రాకపోతే ఏం కొంప మునిగిందిలే...." ఆయనా ధోరణిలో మాట్లాడుతుంటే నేను ఆశ్చర్యపోయాను.

"అదేమిటి సార్... అలా అంటారు?" అన్నాను నేను.

"అది కాదోయ్...." అని ఆయన కొంచెం నసుగుతున్నట్లుగా "వారం క్రితం ఓ మిత్రుడు, చిన్న సర్టిఫికెట్ సంపాయిస్తే డబ్బొస్తుందన్నాడు. అందుకనీ..." అని అనబోతుండగా నేను "డబ్బేమిటీ?" అన్నాను.

"అదేలే. కాలు విరిగి చచ్చిందిగా... సర్టిఫికెట్ కోసం వెళ్ళాను. ఏదో ముడుపు చెల్లించి ఓ సర్టిఫికెట్ తెచ్చుకున్నాను."

ఆయన చెబుతున్నదేమిటో నాకు వెంటనే అర్థం గాలేదు "సర్టిఫికెట్ ఏమిటి సార్?" అనడిగాను.

ఆయన అదోలా నవ్వి "నేను వికలాంగుణ్ని సర్టిఫికెట్ తెచ్చుకున్నానోయ్" అన్నాడు.

ఆయనామాట చెప్పగానే నాకసలు విషయం వెంటనే అర్థమయింది... అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరం సందర్భంగా వికలాంగులయిన ఉద్యోగులు, తాము వికలాంగులయినట్టు సర్జన్ ద్వారా సర్టిఫికెట్ తెచ్చి, మేనేజిమెంట్‌కు చూపిస్తే, అది ఆధారంగా ఆ ఉద్యోగికి అదనంగా నెలకు యాభయి రూపాయల చొప్పున అతడు ఉద్యోగంలో ఉన్నంత కాలమూ ఇస్తారు.

"ఏమిటోయ్ ఆశ్చర్యంగా చూస్తున్నావా? కాలుకొంచెం డిసార్డయినందువల్ల వచ్చిన నష్టమేమిటి లెద్దూ! నడకకే గదా కొంచెం యిబ్బంది. ఈ కాలువల్ల అంతకంటే ఘనకార్యం ఏముందోయ్ చేయటానికి? విరిగితే విరిగిందిలే. దానితో నేనిప్పుడేమన్నా డాన్సు చెయ్యాలా.... ఏమంటావ్?"

"అదేమిటి సార్? కాళ్ళున్న వాళ్లంతా డాన్సులు చేస్తారా? నడవటానికి కాలుండాలి కదా"

"అవుననుకో... మరేం చేస్తాం. తీరా విరిగాక!"

ఆయనలా మాట్లాడుతుంటే నేను నిజంగా విస్తుపోయాను. అనకూడదుగాని కాలు విరిగినందుకు ఆనందిస్తోన్నట్టుగా కనపడ్డాడు ఆ మనిషి! పదిరోజుల క్రితం ఎంత బాధపడ్డాడు. ఆ మనిషేనా ఈ మనిషి... డబ్బు వస్తుందని ఎవరో చెప్పేసరికి కాలుతో ఏం చేస్తాం లెద్దూ అంటాడేమిటి?

"ఈ వయసులో నెలకి యాభై రూపాయలంటే మాటలా మూర్తీ! మా రెండో పిల్లకి కట్నం బాపతు సొమ్ము ఇంకా రెండు వేలివ్వాలోయ్! చిన్నాడికి కొంచెం డొనేషన్ కట్టాలి. వచ్చేది వానాకాలం... చిరగని దుప్పటన్నది లేదనుకో కొంపలో. అద్దె పెంచమని పీకలమీద కూచున్నాడు ఇంటివాడు నెలనెలా. ఏం పెంచుతాం... ఇప్పటిగే రెండు వందలిస్తున్నాం. రెండోపూట కాఫీ తాగాలన్నా బాధే.... నువ్వే చెప్పు మూర్తీ, ఈ వయసులో కాలుకంటే యాభై రూపాయలు విలువైనవా కావా....?"

ఆయనలా మాటాడుతుంటె నిజంగా నాకు జాలేసింది. ఆయనతో ఏం మాట్లాడటానికీ నాకు నోరు రాలేదు. ఆయన మాట్లాడినంతసేపూ మాట్లాడి "వస్తానోయ్ మూర్తీ! మళ్ళీ కలుద్దాం" అని చెప్పి ముందుకు సాగిపోయాడు.

నేను విషాదంగా మొహం పెట్టి పక్కనున్న నా మిత్రుని వేపు చూశాను ముందుకు నడుస్తూ.

"ఏమిట్రా అలా మొహం వేలాడేశావ్" అనడిగాడు రామకృష్ణ.

"జీవితంలో ఇంతకంటే 'ట్రాజడీ' ఇంకేముందిరా...." అన్నాను.

"రేయ్! ఈ ధనస్వామ్య సమాజంలో ప్రతి మనిషీ ప్రతి అవకాశాన్నీ వీలుంటే 'కాష్' చేసుకోటానికే ఉపయోగించుకుంటాడు! ఇది నిజంగా పెద్ద ట్రాజెడీయే! ఇందుకు మనుషుల్ని మాత్రమే తప్పు పట్టకూడదు.. జాలి పడాలి. ఈ ట్రాజెడీ వ్యక్తిగతమయినది కాదు. సామాజికమైనది" అన్నాడు నా మిత్రుడు.

నేను ఒక క్షణం నిలబడి మళ్ళీ అడుగులు ముందుకు వేశాను.

❖ **విపుల, ఫిబ్రవరి 1983**